క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతు బజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమోటా (లోకల్) కిలో రూ. 19, (618 రకం) రూ. 19, వంకాయ రూ. 28, బెండ రూ. 57, పచ్చిమిర్చి రూ. 45, కాకరకాయ రూ. 38, బీరకాయ రూ. 45, క్యాలీఫ్లవర్ రూ. 23, క్యాబేజీ రూ. 10, కారెట్ రూ. 23, దొండ రూ. 47, ఆలుగడ్డ రూ. 21, ఉల్లి రూ. 24, గోకర రూ. 45, దోస రూ. 33, సొరకాయ రూ. 15, పొట్లకాయ రూ. 15, బీన్స్ రూ. 35, క్యాప్సికమ్ రూ. 55 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఐబీపీ పెట్రోల్ పంప్, ఐఎస్‌సదన్ క్రాస్ రోడ్స్, న్యూ సంతోష్‌నగర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు అల్మారీ కార్ఖానా, సంతోష్ నగర్, ఎంఐజీహెచ్ సంతోష్‌నగర్ నెంబర్ 2 గల్లీ, ఖలందర్ నగర్, సంతోష్ నగర్ మెయిన్‌రోడ్, స్కేటింగ్ పార్క్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని డీఈ వివరించారు.

నిత్యావసరాల పంపిణీ



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తున్న మిర్యాల లక్ష్మి నాలుగు రోజుల క్రితం మరణించింది. ఈ నేపథ్యంలో ఆమె దశదిన కర్మకు కావలసిన నిత్యావసర సరకులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సి.మధుర ఉపేందర్‌రెడ్డి మరణించిన లక్ష్మితో పని చేసిన కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, జహంగీర్, అంజి, జగదీష్, అనిల్, ఖలీద్‌భాయ్, శివ, మాధవ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

లింగోజిగూడ: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని... ఆ దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్, రాష్ట్ర టూరిజం శాఖ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ హాల్‌లో లోక కల్యాణార్థం 1869వ సర్వ సౌభాగ్య దేవిత్రయ గీత జ్ఞాన యజ్ఞం పూర్ణాహుతి కార్యక్రమం శుక్రవారం ముగిసింది. శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు ఆచారి, తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేష్ గుప్తా, ఎంపీపీ తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్, నేతలు ఉపేందర్ గుప్తా, ఊర లక్ష్మణ్, సూరిశెట్టి సురేష్ గుప్తా, ఎలకుర్తి జగన్, కల్వ సుజాత తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ యజ్ఞ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు నిర్వాహకులు రాజేశ్వరశర్మ, సూరిశెట్టి శ్రీనివాస్‌గుప్తా తెలిపారు.

కేపీటీ ఫలితాల్లో 'శ్రీచైతన్య' ప్రభంజనం

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా కేపీటీ ఒలంపియాడ్ నిర్వహించిన పరీక్షల్లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లలో పరీక్షలు నిర్వహించారు. 4,500 మంది విద్యార్థులు నగదు అవార్డులను అందుకోగా ఇందులో అత్యధికంగా 2,311 మంది శ్రీచైతన్య విద్యార్థులు ఉన్నారు. అలాగే 25 వేల మందికి మెడల్స్ ప్రకటించగా.. ఇందులో 12,860 మంది శ్రీ చైతన్య విద్యార్థులేనని స్కూల్ డైరెక్టర్ సీమ ఒక ప్రకటనలో వెల్లడించారు.

'వారిపై చర్యలు తీసుకోండి'

హుడాకాంప్లెక్స్: గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యదర్శి రావినూతల శశిధర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాచకొండ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ కో కన్వీనర్ బి.సురేశ్‌కుమార్ మాట్లాడుతూ విజయవాడ, ఇబ్రహీంపట్నం హైవేలపై పికెట్ ఏర్పాటు చేసి గోవులను తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేయాలని కోరారు. యువత మత్తు, గంజాయి, డ్రగ్స్ తీసుకోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు డ్రగ్స్ అక్రమ రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దోమల మాటున దండుకున్నారు?

- పారిశుద్ధ్య విభాగంలోని కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలు స్వాహా
- విధులకు దూరంగా ఉన్నా హాజరైనట్లు రికార్డులు
- అక్రమార్కుల జేబుల్లోకి 30 మంది వేతనాలు
- కాంట్రాక్టర్, అధికారుల పాత్రపై సర్వత్రా అనుమానాలు



చెరువులో పేరుకపోయిన గుర్రపుడెక్క

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో కోవిడ్ సమయంలో స్ప్రే చేసేందుకు సర్కిల్‌కు ఐదుగురి చొప్పున 30 మందిని కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకున్నారు. వారికి వేతనాలను చెల్లించే విషయంలో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్లు వాటాలు పంచుకున్నట్లు తెలుస్తోంది. విధులకు దూరంగా ఉన్నా హాజరైనట్లు రిజిస్టర్‌లో నమోదు చేసి సుమారు రూ. 4 లక్షలకు వరకు సిబ్బంది వేతనాలను అక్రమ మార్గంలో తమ జేబుల్లోకి మళ్లించినట్లు ఆరోపణలున్నాయి.

- జోనల్ పరిధిలో ఐదు సర్కిళ్లకుగాను కోవిడ్ ముగిసిన తర్వాత వీరిని గత సంవత్సరం అక్టోబర్ నుంచి గుర్రపు డెక్కను తొలగించేందుకు ప్రత్యేంగా సర్కిల్‌కు ఐదుగురిని నియమించారు. ఇలా ఐదు సర్కిల్‌లో 30 మంది సిబ్బందిని ఒక ప్రైవేటు సంస్థ ద్వారా ఎంటమాలజీ విభాగంలో నియమించారు.
- ప్రస్తుతం వీరు కేవలం చెరువుల్లో ఉన్న గుర్రపు డెక్కను మాత్రమే తొలగించాలి. వీరికి నెలకు సుమారు రూ. 10 వేలు వేతనం కింద ఒప్పందం చేసుకున్నాడు కాంట్రాక్టర్.
- అక్టోబర్‌లో వీరి కాంట్రాక్ట్ రద్దు కావడంతో వీరంతా 10 రోజులు పని మానుకున్నారు. ఇక కథ ఇక్కడనే అడ్డం తిరిగింది. తర్వాత ఒప్పంద కార్మికుల కాంట్రాక్ట్ మరోసారి పొడిగించారు.
- ఈ 10 రోజుల సమయంలో ఒప్పంద కార్మికులు పనిచేయకున్నా పని చేసినట్లు హాజరు నమోదు చేసి సుమారు రూ. 3.70 లక్షలను అక్రమార్గంలో ఎంటమాలజీ అధికారి, కాంట్రాక్టర్ తమ జేబులో వేసుకున్నట్ల ఆరోపణలు వినిపస్తున్నాయి.
- దోమలు ఉండాలి... దోచుకోవాలి అన్నట్లుగా ఉన్న ఎంటమాలజీ అధికారుల తీరుపై సర్వతా విమర్శలు వినిపిస్తున్నాయి. జోనల్ పరిధిలో ఐదు సర్కిళ్ల పరిధిలో సుమారు 19 చెరువులు, మూసీ పరీవాహక ప్రాంతం ఉంది.
- ఈ చెరువుల్లో ఉన్న గుర్రపు డెక్కను తొలగించేందుకు కాంట్రాక్ట్ కార్మికులు పనిచేయాలి. చెరువులో ఉన్న గుర్రపు డెక్క పనులు అధికారులకు మేతగా మారిందని తెలుస్తోంది. నిరంతం గుర్రపు డెక్క పనులు తొలగించే పనులు ఉంటే రెండు నెలల్లో ఈ పనులను పూర్తి చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటుండగా గుర్రపు డెక్క మాటున దోచుకునేందుకు అవకాశం ఉన్నందునే నిరంతరం ఈ పనులు చేయిస్తున్నారని కొందరు బాహాటంగానే చెబుతున్నారు.

దీంతో దోమలు ఉండాలి... దోచుకోవాలి అనే రీతిలో అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తథ్యం



ఒప్పంద కార్మికుల వేతనాలో జరిగిన అక్రమాలపై జోనల్ కమిషనర్ పంకజ స్పందించారు. ఈ విషయంపై ఇప్పటికే విచారణ అధికారిని నియమించామన్నారు. అక్రమ మార్గంలో కాంట్రాక్ట్ కాక్మికుల వేతనాలను స్వాహా చేసిన ఎంటమాలజీ అధికారులపై త్వరలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంటమాలజీ అధికారిపై పలు ఆరోపణలు వస్తున్నాయని ఆమె స్పష్టం చేశారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- మలక్‌పేట మార్కెట్‌లో పరిస్థితులు దుర్భరం
- మురుగు, దుర్గంధంతో తప్పని ఇబ్బందులు



మార్కెట్ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, పారుతున్న మురుగు

చాదర్‌ఘాట్: నగరంలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరుగాంచిన మలక్‌పేట మార్కెట్‌లో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో రోజురోజుకూ పరిస్థితి దుర్భరంగా తయారవుతోంది. అధికారులకు ఎప్పుడూ మార్కెట్ ఆదాయంపైన, పాలకవర్గానికి మార్కెట్‌లో తమ పట్టు సాధించుకోవాలన్న తపన తప్ప మార్కెట్‌లో నెలకొన్న సమస్యలపై ఎవరికీ పట్టింపు లేకుండా పోయింది. శుక్రవారం మార్కెట్ ప్రాంగణంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, వ్యర్థాలు దర్శనమిచ్చాయి. దీనికి తోడు దశాబ్దాల కాలంగా ఎవరికీ పట్టని మురుగు సమస్య తోడై మార్కెట్‌కు వచ్చేవారికి అడుగు తీసి అడుగు వేయలని పరిస్థితితో దిక్కుతోచని స్థితి నెలకొంది. మార్కెట్ ప్రాంగణంలో చెత్త, వ్యర్థాలు ఎవరూ వేయకుండా అడ్డుకునే వ్యవస్థ లేదు. వేసిన చెత్త తొలగించే సిబ్బంది లేరు. మార్కెట్‌లో పారిశుద్ధ్య సమస్య నియంత్రించే వారు లేక, నిర్మూలించేది ఎవరో తెలియక ఇబ్బందులు మాత్రం మార్కెట్‌కు వచ్చే రైతులు, వినియోగదారులకు తప్పటం లేదు. ఇప్పటికైనా మార్కెట్ పాలకవర్గం, అధికారులు మార్కెట్ సమస్యలపై దృష్టి పెట్టాలని పలువురు రైతులు, వ్యాపారులు, కార్మికులు, వినియోగదారులు కోరుతున్నారు.

పోలీసు విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తికి జైలుశిక్ష

మలక్‌పేట: పోలీసుల విధులకు ఆటంకం కల్గించి, న్యూసెన్స్ చేసిన ఓ వ్యక్తికి న్యాయస్థానం 18 రోజులు జైలు శిక్ష విధించిందని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సమాచారం మేరకు... మహమ్మద్ అజీమ్(37)వృత్తి రీత్యా ఆర్కిటెక్ట్. ఆస్మాన్‌ఘడ్‌లోని బిలాల్ మసీద్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 19 గురువారం ఉదయం 11 గంటల సమయంలో డయల్ 100 కాల్ వచ్చిన సందర్భంలో గాంధీనగర్‌కు వెళ్లిన డ్యూటీలో ఉన్న పోలీసు సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించి న్యూసెన్స్ చేశాడు. అతనిపై పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం 7వ స్పెషల్ ఎంఎం కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఈ విషయంపై వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి నిందితుడికి 18 రోజులు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

జీహెచ్‌ఎంసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

- కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలి
- జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీ ఎల్‌బీ నగర్ జోన్ పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, జీహెచ్‌ఎంసీ రంగారెడ్డి జిల్లా యూనియన్ అధ్యక్షుడు అలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి, ఎల్లయ్య మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీలో మున్సిపల్ స్వీపింగ్ కార్మికులకు ఈఎస్‌ఐ ఉన్నా లేని పరిస్థితులు నెలకొనడం దారుణమన్నారు. జీహెచ్‌ఎంసీలో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదానికి గురైన వారికి వైద్య సేవలు, వైద్య సెలవులు ఇవ్వకుండా కార్మికులని తీవ్ర అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. జీహెచ్‌ఎంసీ లో ఈఎస్‌ఐ, పీఎఫ్‌కు ప్రత్యేకమైన అధికారులు కేటాయించి ఈఎస్‌ఐ, పీఎం సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జీహెచ్‌ఎంసీలో పని చేస్తూ రిటైర్ అయిన, కార్మికులకు పీఎఫ్ నుంచి కానీ ఈఎస్‌ఐ నుంచి కానీ ఎలాంటి బెనిఫిట్‌లు పెన్షన్లు అందడం లేదని దీనికి ఎవర బాధ్యత వహిస్తారని అధికారులని నిలదీశారు. అనేక మంది జీహెచ్‌ఎంపీ కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ నుంచి గానీ పెన్షన్ తదితర బెనిఫిట్స్ ఏవీ ఇవ్వలేదని అన్నారు.. వేలాదిమంది పనిచేస్తున్న జీహెచ్‌ఎంసీలో ఈఎస్‌ఐ, పీఎఫ్‌కు ప్రత్యేక అధికారిని కేటాయించి వీరికి ఎప్పటికప్పుడు ఈఎస్‌ఐ నుంచి రావలసిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం ఆంధ్రప్రదేశ్‌లోలా తక్షణమే రూ. 21 వేలు ఇవ్వాలన్నారు. కనీస వేతనాన్ని రూ. 26 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఎం.వీరయ్య, జీహెచ్‌ఎంసీ యూనియన్ నాయకులు పి.శ్రీనివాస్, సైదులు, అంజమ్మ, శ్రీరాములు, రేణుక నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి పరిహారం చెల్లించాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలికి నష్టపరిహారం చెల్లించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్‌కు ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 10వ తేదీన విధి నిర్వహణలో భాగంగా పారిశుద్ధ్య కార్మికురాలు దుర్గమ్మ ఆటోనగర్ వద్ద పనిచేస్తుండగా వెనుక నుంచి లారీ వచ్చి ఆమెను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్గమ్మను ఎర్రగడ్డలోని ఈఎస్‌ఐ హాస్పిటల్‌కు తరలించారు. నాలుగు రోజుల అనంతరం చికిత్స పొందుతూ దుర్గమ్మ మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సంప్రదించగా వెంటనే జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్ కలిసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నగర మేయర్ నిధుల నుంచి రూ. 2 లక్షలు, ఈఎస్‌ఈపీఎఫ్ కింద మరో రూ. 12 లక్షలు ఇప్పించనున్నట్లు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెల్లడించారు. బాధిత కుటుంబ సభ్యులకు అతి త్వరలో నష్టపరిహారం అందజేస్తామన్నారు. అలాగే గతంలో కూడా రోడ్డు ప్రమాదంలో చనిపోయిన పారిశుద్ధ్య కార్మికులు (పార్వతమ్మ, లింగయ్య, లక్ష్మమ్మ) వారి బంధువులు తన కార్యాలయంలో సంప్రదిస్తే వారికి కూడా తగు నష్టపరిహారం ఇప్పిస్తామని ఆయన తెలిపారు.

డ్రైనేజీ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్



జలమండలి అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను సత్వరమే శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి అధికారులను కోరారు. శుక్రవారం జలమండలి జీఎం బలరాం, డీజీఎం శ్రీనివాస్‌ను కలసి డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలపై చర్చించారు. నాయకులు రామకృష్ణ, కొత్త తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

చలపతిరావు సేవలు చిరస్మరణీయం

హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



చలపతిరావుకు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించిన బండారు దత్తాత్రేయ

సైదాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోషియేషన్ (హెచ్‌సీఏ) మాజీ కార్యదర్శి డి.ఎస్.చలపతిరావు క్రికెట్ క్రీడకే తన జీవితాన్ని అంకితం చేశారని... ఆయన సేవలు చిరస్మరణీయమని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి చలపతిరావు అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 5న మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం సైదాబాద్ డివిజన్ ఆస్మాన్‌ఘడ్‌లోని ఆయన ఇంటికి చేరుకున్న బండారు దత్తాత్రేయ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. చలపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... పలు క్రీడల్లో ఎంతోమందికి శిక్షణ ఇచ్చిన ఆయన వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. నీతి, నిజాయితీ, నిబద్ధత, జాతీయ భావాలతో దేశం కోసం ఆయన పనిచేశారని అన్నారు. ఆయనతో తనకున్న సాన్నిహిత్యాన్ని దత్తాత్రేయ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మలక్‌పేటలో బీజేవైఎం నాయకుల అరెస్ట్

మలక్‌పేట: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లో రాస్తారోకో నిర్వహించారు. అంతకు ముందు వారు ప్లకార్డులతో ప్రదర్శనగా గడ్డిఅన్నారం చౌరస్తా నుంచి దిల్‌సుఖ్‌నగర్ కమల ఆసుపత్రి వద్ద విజయవాడ రహదారిపైకి వచ్చి రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నించగా వారిని మలక్‌పేట పోలీసులు అడ్డుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సిబ్బందితో వారిని అదుపులోకి తీసుకుని అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం నాయకులు శివచంద్రగిరి, రమణ్‌సింగ్, దినేష్, ఆశీష్, భరత్, ప్రమోద్, జగన్ ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించని లారీ యజమానులపై చర్యలు తథ్యం



సమావేశంలో పాల్గొన్న లారీ యజమానుల సంఘం నాయకులు

వనస్థలిపురం: ఆటో నగర్‌లో తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూడిద నందరారెడ్డి ఆధ్వర్యంలో లారీ యజమానుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నందారెడ్డి మాట్లాడుతూ... గత నెల 15వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇసుక లారీల యజమానులు టీఎస్‌ఎండీసీ అధికారికంగా నిర్వహిస్తున్న బకెట్‌లు పూర్తిగా బంద్ చేసి పాసింగ్ లోడ్ తీసుకురావాలని, వివిధ జిల్లాల నుంచి వచ్చే జీరో ఇసుకను నిషేధించాలని తీర్మానించామన్నారు. అయినా కొందరు లారీ యజమానులు ఓవర్ లోడ్ తోలుతున్నారు. ఇకపై అలా చేయరాదని... ఓవర్ లోడ్‌తో వచ్చే ఆయా లారీల యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, యాదయ్యగౌడ్, శ్రీనివాస్, రాజుగౌడ్, అంజయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



ఎన్టీఆర్ నగర్‌లో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

దిల్‌సుఖ్‌నగర్: శిథిలమైన మ్యాన్‌హోళ్లతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదర్కొంటున్నారు. మ్యాన్‌హోళ్ల నిర్మాణాలు సరిగా లేకపోవడంతో వేసిన కొద్ది రోజులకే అవి పాడై పోతున్నాయి. ఆర్‌కేపురం డివిజన్‌లో కొన్ని నెలల క్రితం వేసిన మ్యాన్‌హోళ్లు నాసిరకంగా ఉండటంతో ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడినందునే మ్యాన్‌హోళ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. దీనిపై వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతలేని కారణంగా ఇటీవల మరమ్మతులు చేపట్టిన మ్యాన్‌హోల్స్ కూడా పాడై కంగి పోతున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పాడైన మ్యాన్‌హోళ్ల సమస్యలపై దృష్టి సారించి ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దాలి

కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్



ఎస్‌బీహెచ్ కాలనీలో ప్యాచ్ వర్క్ పనులను పరిశీలిస్తున్న కొత్తపేటకార్పొరేటర్ పవన్ కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని రోడ్లను అందంగా తీర్చిదిద్ది.. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి గుంతలు రోడ్లుగా తీర్చి దిద్దాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పలుప్రాంతాల్లో జరుగుతున్న సీసీ, బీటీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధాన రహదారుల్లో గుంతలు ఏర్పడిన ప్రాంతాలను గుర్తించి ప్యాచ్ వర్క్ చేయాలని సూచించా. జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరయ్య, బీజేపీ నాయకులు రామకృష్ణ, వెంకట్ రెడ్డి, శరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకంగా 'కంటి వెలుగు'



కంటి అద్దాలను అందజేస్తున్న మహమూద్‌అలీ, పక్కన ఎమ్మెల్యే బలాల



ఆర్‌కేపురంలో పాల్గొన్న గ్రంథాలయాల చైర్మన్ అయాచితం శ్రీధర్

హోం మంత్రి మహమూద్ అలీ

మలక్‌పేట: దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని.. దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని హోం మంత్రి మహమూద్‌అలీ అన్నారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి మూసారంబాగ్ శ్రీపురం కాలనీలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కంటి పరీక్ష శిబిరాన్ని సందర్శించారు. శిబిరం విజయవంతం చేసేందుకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర సర్కార్ ప్రజారోగ్యానికి పెద్ద పీఠ వేసిందన్నారు. బస్తీ దవాఖానాలు పెట్టి పేదలకు చేరువగా వైద్య సేవలు తీసుకొచ్చిందన్నారు. ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ... పైసా ఖర్చులేకుండా పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు, అద్దాలు, మందులు అందజేస్తున్నారన్నారు. వంద రోజుల పాటు కొనసాగే కంటి పరీక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూసారంబాగ్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ నేత అజిత్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి, ఎంఐఎం నేత కనుకుల రవీందర్‌రెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి...

దిల్‌సుఖ్‌నగర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ అయాచితం శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ హరిపురి అసోసియేషన్ పార్క్‌లో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ జనరల్ సెక్రటరీ మురుకుంట్ల అరవింద్, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్‌తో కలసి కంటి వెలుగు సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సాజిద్, గొడుగు శ్రీనివాస్, నేలకొండ శ్రీనివాసరెడ్డి, కొండ శ్రీనివాస్, కంచర్ల శేఖర్, దుబ్బాక శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, ఎల్లన్న, వెంకటేష్ గౌడ్, ముచ్చింతల జగన్, ఊర్మిళ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్‌మలక్‌పేటలో...

చాదర్‌ఘాట్: కంటి వెలుగు కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హోం మంత్రి మహమూద్ అలీ సూచించారు. శుక్రవారం ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని సాలార్ ఎ మిల్లత్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన మలక్‌పేట ఎమ్మెల్యే బలాలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కంటి వెలుగు కేంద్రాలలో అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా అందిస్తారన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, సరోజినీ కంటి ఆసుపత్రికి రెఫర్ చేస్తారని తెలిపారు.